క్లుప్తంగా

వేసవి శిబిరంతో విజ్ఞానం పెంపు



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని లైబ్రేరియన్ కౌసల్య అన్నారు. మండల కేంద్రంలో గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఆదివారం విద్యార్థులకు ఆటపాటలతో పాటు నీతి కథల పుస్తకాలు చదివించారు. ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎక్కడ పడితే అక్కడ వృథాగా తిరుగకుండా, కాలయాపన చేయకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు సమ్మర్ క్యాంపు ఎంతో తోడ్పతుందన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



తాతగారి పుల్లారెడ్డి(ఫైల్)

పగిడ్యాల: ఆదివారం ఉదయం గుండెపోటుకు గురై వైఎస్సార్‌సీపీ నాయకుడు తాతగారి పుల్లారెడ్డి(70) హఠాన్మరణం చెందారు. పగిడ్యాల గ్రామానికి చెందిన ఈయన 2014 నుంచి వైఎస్సార్‌సీపీలో కొనసాగుతూ పార్టీ కోసం సేవలు అందిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు: పట్టణంలోని నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీయం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శిరణధీర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీయం కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పట్టణంలోని 24 వార్డుల్లో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలన్నారు. చిన్నపాటి వర్షానికే ఇళ్ల ముందు, రోడ్ల పై మురుగు నీరు నిల్వ ఉంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలో కుక్కల బెడద అధికమైందని, వాటిని నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సురేంద్ర, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి వలంటీర్లకు సన్మాన కార్యక్రమాలు

కొత్తపల్లి: మండల ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన గ్రామ వలంటీర్లకు ఈనెల 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సచివాలయాల వారీగా సన్మాన కార్యక్రమాలు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓ మేరి ఆదివారం తెలిపారు. 25న దుద్యాల – 1, 2 సచివాలయాలు, 26న కొక్కెరంచ, దురుపాడు, 27న గోకవరం, శివపురం, 29న గుమ్మడాపురం, ముసలిమడుగు, 30న ఎర్రమఠం, గువ్వలకుంట్ల, 31న కొత్తపల్లి సచివాలయంలో కార్యక్రమాలు ఉంటాయన్నారు.

తిమ్మాపురంలో యువకుల మధ్య ఘర్షణ

మహానంది: పాతకక్షలు, మనస్పర్థల నేపథ్యంలో యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో ఒకరికి గాయాలైన సంఘటన తిమ్మాపురంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఫకృద్దీన్‌పై అదే గ్రామానికి చెందిన కొలిమి జమాల్ వలి, రంగాచారి, మరొకరు దాడి చేసి గాయపరిచారన్నారు. బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణచేసినట్లు తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

మహానంది: బండిఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన టి.వెంకటేశ్వర్లు (60) బర్రెలు మేపుకునేందుకు వెళ్లి వడదెబ్బకు గురై మృతి చెందిన సంఘటన బండిఆత్మకూరు మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. బర్రెలు మేపుకునేందుకు వెళ్లగా ఉరుములు, పెరుపులు రావడంతో వడదెబ్బకు గురై మృతి చెందినట్లు తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. మృతి చెందిన వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యుల్లో విషాదం నెలకొంది.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో జూన్ 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులుండగా ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ఖాళీలున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ క్యాండిలైట్ మెమోరియల్ డే

ఆత్మకూరు: పట్టణంలోని మెరిబా స్వచ్ఛంద సేవా ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ క్యాండిలైట్ మెమోరియల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సంజీవరెడ్డి, మేనేజర్ అలిఖాన్ మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ వలన మృతి చెందిన వారి కుటుంబసభ్యులకు ఆత్మస్థైర్యాన్ని నింపి మనో. ధైర్యం కల్పించేందుకు అంతర్జాతీయ క్యాండిలైట్ మెమోరియల్ డే ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌ఐవీ సోకిన వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలని కోరారు.

ఆత్మకూరులో వడగళ్ల వాన

- పెనుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- పలు గ్రామాల్లో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- పిడుగుపాటుకు ఆవుదూడ మృతి

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం పెనుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. పెనుగాలులతో కూడిన వర్షానికి పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ వేడిమికి తల్లడిల్లిన ప్రజలు సాయంత్రం 4 గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై ఉన్నఫలంగా పెనుగాలులు కూడిన వడగల్ల వర్షానికి కాస్త ఉపశమనం పొందారు. ఆత్మకూరు, కురుకుంద గ్రామాల్లో వడగళ్ల వర్షం పడడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. పెనుగాలుల వలన కురుకుంద, కరివేన నల్లకాల్వ , సిద్ధపల్లి, సిద్ధాపురం గ్రామాలలో విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో విద్యుత్‌సరఫరా నిలిచిపోవడంతో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని ట్రాన్స్‌కో ఏఈ రమేష్ బాబు తెలిపారు. ఈ వర్షాలు వేడిమితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఊరటనిచ్చాయి. అయితే అకాల వర్షాలకు, గాలులకు మామిడి కొమ్మలు విరిగిపోవడం, పిందెలు రాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఎస్ఎస్‌తాండలో పిడుగు పాటుకు ఆవుదూడ మృతి

మండలంలోని ఎస్ఎస్‌తాండ గ్రామంలో పిడుగు పడి ఆవుదూడ అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామానికి చెందిన తులసీ నాయక్‌కు చెందిన ఆవుదూడ కల్లంలో చెట్టుకింద కట్టి ఉంచాడు. ఈ సమయంలో చెట్టుపై పిడుగు పడడంతో చెట్టు రెండుగా నెర్రలు బారింది. చెట్టు కింద ఉన్న ఆవుదూడె అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు దూడ విలువ రూ.20 వేల వరకు ఉంటుందని యజమాని తులసీ నాయక్ చెప్పారు.



బానకచెర్ల వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం



కురుకుందలో మృతి చెందిన ఆవుదూడ

విరిగిన విద్యుత్ స్తంభాలు

పాములపాడు: పెనుగాలులకు మండలంలోని భానుముక్కల, బానకచెర్ల గ్రామాల మధ్యన విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. శనివారం రాత్రి కురిసిన వర్షం, విపరీతమైన గాలుల వల్ల విద్యుత్ స్థంబాలు నెలకొరగడంతో ఆగ్రామాలు అంధకారంలో మగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యామ్నాయంగా నల్లకాలువ గ్రామం నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. పొలాల్లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, తీగల వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందని అధికారులు సత్వరమే స్పందించి తగుచర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇందిలా భానుముక్కల గ్రామంలో గాలీవానకు ఓ భారీ వృక్షం గడ్డం దేవసహాయం, గడ్డం బాలమ్మ ఇళ్ల రెండు మిద్దెలపై పడింది. ఈ సంఘటన లో మిద్దెలు చాలా వరకు దెబ్బతిన్నాయి. ఆదివారం సీపీఎం మండల కార్యదర్శి సామన్న, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్ దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు., బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారంగా రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



సంగమేశ్వరం ప్రధాన రహదారిలో రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డ చెట్టు



రోడ్డపై అడ్డంగా పడిన ముళ్ల పొదలను తొలగిస్తున్న దృశ్యం

ఈదురు గాలులతో వర్షం

కొత్తపల్లి: మండలంలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. మండలంలోని దుద్యాల, నందికుంట, బావాపురం, లింగాపురం, ఎదురుపాడు, జడ్డువారిపల్లె, కొక్కెరంచ, నాగంపల్లి, కొత్తమాడుగుల గ్రామాలో వర్షం కురిసింది. ఈ వర్షానికి పొలాలలో వర్షపు నీరు చేరింది. ఖరీఫ్ సీజన్ పంటల సాగుచేసుకునేందుకు దుక్కుల కోసం ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలుల ధాటికి దుద్యాల,నందికుంట గ్రామాల మధ్య రహదారికి అడ్డంగా ముళ్లపొదలు విరిగి పడ్డాయి. అదేవిధంగా బావాపురం, కొత్తపల్లి గ్రామాల మధ్య ఆత్మకూరు, సంగమేశ్వరం ప్రధాన రహదారిలో చెట్టు రోడ్డుకు అడ్డంగా విరిగి పడింది. దీంతో ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులు పడ్డారు.

ఈరోజు

స్పందన కార్యక్రమం

నందికొట్కూరు: పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తునట్లు తహసీల్దార్ రాజశేఖర్‌బాబు ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎలాంటి సమస్యలున్నా రెవెన్యూ కార్యాలయంలో జరిగే స్పందనలో అర్జీలు, దరఖాస్తులు ఇవ్వాలని చెప్పారు. ఈ అవకాశాన్ని మండల, పట్టణ ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

వలంటీర్లకు సన్మానం

పగిడ్యాల: ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధాన కర్తలుగా విశేష సేవలు అందించిన గ్రామ వలంటీర్లను సేవారత్న, సేవామిత్ర, సేవావజ్ర క్యాటగిరీల వారీగా సన్మానించేందుకు ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం పగిడ్యాల – 1,2 సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు సన్మానం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పారుమంచాలలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో సోమవారం ఉదయం 9గంటలకు నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సమక్షంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంజులవాణి, సర్పంచ్ ప్రకాశం తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమానికి అన్నిశాఖల మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని కోరారు.

లక్ష్మాపురంలో మైసమ్మ జాతర



గంపలతో మైసమ్మ వద్దకు బయలుదేరిన బుడగజంగాలు



ముస్తాబైన మైసమ్మ ఉత్సవమూర్తి విగ్రహం

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో ఆదివారం బుడగజంగాల కులస్తులు మైసమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. గ్రామ శివారుల్లోని మైసమ్మకు బుడగ జంగాలు భక్తిశ్రద్ధలతో బోనాలతో ఆలయానికి చేరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమకుటుంబాలను ఆయురారోగ్యాలతో కాపాడాలని, పాడిపంటలతో వర్ధిల్లి సుఖసంతోషాలతో కలిగించాలని మైసమ్మకు మొక్కులు చెల్లించారు. గ్రామ పురవీధులగుండా పెద్ద ఊరేగింపు నిర్వహించడంతో గ్రామంలో పండుగ వాతవారణం నెలకొంది.

పొలాలకు నీరిచ్చేదాకా దీక్ష విరమించం

జూపాడుబంగ్లా: మండ్లెం, తంగడంచ, భాస్కరాపురం గ్రామాల్లోని పొలాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీటిని ఇచ్చే దాకా జలదీక్షను విరమించబోమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, కార్మిక సంఘం నాయకుడు పక్కీర్‌సాహెబ్ స్పష్టం చేశారు. మండ్లెం గ్రామంలో రైతులు చేస్తున్న జలదీక్షకు ఆదివారం వారు మద్దతు ప్రకటించారు. వారు మాట్లాడుతూ మూడు గ్రామాల పరిధిలో 5వేల ఎకరాల సాగుభూములున్నట్లు తెలిపారు. వాటిల్లో 750 బావులు, 300 బోర్లు ఉన్నాయన్నారు. బోర్లు, బావులు అధికం కావడంతో భూగర్భజలాలు తగ్గిపోవటంతో పంటపొలాలకు సాగునీరు అందడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు గోపాలకృష్ణ, రైతులు సురేష్, శివప్రసాద్, శ్రీనివాసులు, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షానికి నిజంగా ఖర్మ పట్టింది

శ్రీశైలం టెంపుల్: రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేస్తుంటే.. ఇదేం ఖర్మ అని ప్రతిపక్షం తిరుగుతోందని, నిజంగానే వారికి ఖర్మ పట్టిందని ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీకి, ఎల్లో మీడియాకు ప్రజల చేతుల్లో వీరబాదుడు తప్పదన్నారు. ప్రతిపక్ష శాసన సభ్యులు సభలో ఉండి ప్రభుత్వం తప్పు చేస్తే ప్రశ్నించాలి కానీ స్పీకర్ పోడియం వద్దకు వచ్చి నిరసన తెలియజేస్తే ఎలా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో కంటే ప్రస్తుత శాసనసభ సజావుగా సాగుతోందని, సభ్యులు కూడా వారి విలువలను, హద్దులను కాపాడుకోవాలన్నారు. అవినాష్‌రెడ్డి వ్యవహారం సీబీఐ చూసుకుంటుందన్నారు. లోకేష్ పాదయాత్రను ప్రజలే విశ్వసించడం లేదని, ఇక మా పార్టీ ఆ పాదయాత్ర గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అన్నింటినీ నెరవేర్చాం కాబట్టి 175 సీట్లకు 175 సీట్లు గెలుస్తామని ధీమాగా ఉన్నట్లు చెప్పారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ఏదో ఒక విమర్శలు చేయాలి కాబట్టి చేస్తున్నాయి కానీ, లేకుంటే వారికి రోజు గడవదని విమర్శించారు. గతంలో టీడీపీకి మూడుసార్లు అధికారం ఇస్తే ప్రజలకు ఏమీ చేయకుండా.. ఇప్పుడు మళ్లీ అవకాశం ఇవ్వాలని అడగటాన్ని ప్రజలు విశ్వసించడం లేదన్నారు.



స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులకు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలనడం సబబుకాదు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్‌కాలనీలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని జలవనరుల శాఖ ప్రకటించడం సబబు కాదని అఖిల పక్ష సమావేశం తీర్మానించింది. సున్నిపెంటలోని స్వామిరెడ్డి భవన్‌లో అఖిల పక్ష నేతలు సమావేశం నిర్వహించారు. గ్రామాన్ని పంచాయితీరాజ్ శాఖకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు తీసుకొచ్చిందని, ఈ సమయంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రజలపై ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదని అఖిల పక్ష నేతలు అభిప్రాయపడ్డారు. గతంలో ఇంటి అద్దెలు, నీటి పన్నులు, భూమి శిస్తు చెల్లించేవారని, జలవనరుల శాఖ అస్తవ్యస్థ పరిపాలన వలన ప్రజలు కొంత కాలంగా బిల్లులు చెల్లించడం లేదన్నారు. అయితే ఇప్పుడు పాతబకాయిలన్నీ చెల్లించాల్సిందేనని జలవనరుల శాఖ అధికారులు నిర్ణయించడం తగదని అన్నారు. బిల్లులు చెల్లించాలని ప్రజలపై ఒత్తిడి తెస్తే ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు నాగిరెడ్డి, సీపీఐ నాయకులు ఓబులయ్య, కాంగ్రెస్ నాయకులు ఏఎస్ ఇస్మాయిల్, ఐఎఫ్‌టీయూ నాయకులు వై.ఆశీర్వాదం, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి బియ్యం వితరణ


మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యన్నదాన పథకానికి అబ్బీపురం గ్రామానికి చెందిన వ్యవసాయ సలహామండలి చైర్మన్ శరభారెడ్డి దంపతులు ఆదివారం పది టిక్కీల బియ్యాన్ని విరాళంగా అందించినట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈ మేరకు వారికి స్వామి,అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

శ్రీశైలంలో ఎకరా స్థలం కేటాయించాలి

కర్నూలు(సెంట్రల్): భావసార క్షత్రియుల అన్నదాన కేంద్రానికి శ్రీశైలం పుణ్యక్షేత్రంలో ఒక ఎకరా స్థలం కేటాయించాలని భావసార క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.శివశంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ఆ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు ఎంబీసీ కింద గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో క్షత్రియులకు ప్రత్యేక కోటా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు రవిశంకర్ నాయకులు సుందరరావు పాల్గొన్నారు.

గస్తీతో నేరాల నియంత్రణ

బొమ్మలసత్రం: రాత్రి సమయంలో పోలీస్ సిబ్బంది నిర్వహించే గస్తీతో నేరాలను నియంత్రించవచ్చని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం డోన్ సబ్‌డివిజన్ పోలీస్ అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులపై దర్యాప్తు ముమ్మరం చేయాలని సూచించారు. హత్యలు, హత్యాయత్నాలు, మహిళపై దాడులు, మిస్సింగ్, ఆస్తి తగాదాలు, రోడ్డు ప్రమాదాల కేసుల్లో సాంకేతికతను వినియోగించుకొని కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టులో నడిచే కేసుల్లో నిందితులు తప్పించుకోకుండా తగిన సాక్షాధారాలు సమర్పించి శిక్షలు పడేలా చూడాలన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాల పనితీరు, కెమెరాల ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా ప్రకటించి ప్రయాణికులను అప్రమత్తం చేసేలా సూచికలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆన్‌లైన్, లోన్‌యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎస్బీ డీఎస్పీ సంతోష్, సీఐ దస్తగిరిబాబు, సీఐ జయరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

ఉపాధి కూలీలకు ఆన్‌లైన్ కష్టాలు

జూపాడుబంగ్లా: ఉపాధి హామీ పథకంలో కొత్త పద్ధతులు అమలు చేయటంతో మేట్లు, కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జాతీయ ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకోవటంతో పాటు ఆన్‌లైన్ ద్వారా నేరుగా ఉపాధికూలీల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చేస్తోంది. 2023 ఏప్రిల్ నుంచి తప్పనిసరిగా ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఉపాధికూలీల హాజరువేస్తేనే వారికి కూలీ వర్తిస్తుంది. ఆన్‌లైన్ హాజరులో తేడా రాకుండా మ్యానువల్ హాజరు కూడా నమోదు చేయాల్సి ఉంది. రెండు హాజర్లు సరిపడితేనే కూలీలు చేసిన పనికి వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుంది. అయితే ఆన్‌లైన్‌లో మస్టర్ వేసి అప్‌లోడ్ చేసే సమయంలో ఒక్కో పర్యాయం సబ్‌మిట్ కావడం లేదు. దీంతో ఆన్‌లైన్ హాజరు వర్తిస్తుందో లేదో నని మేట్లు, వేసీకర్స్ ఆందోళన పడుతున్నారు. ఈ విషయంపై జూపాడుబంగ్లా అసిస్టెంటు ప్రాజెక్టు అధికారిణి గౌరీబాయిని వివరణ కోరగా.. హాజరువేసే సమయంలో ఆన్‌లైన్ సమస్యలు అప్పుడప్పుడు ఉత్పన్నం అవుతున్నాయని, వాటిని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని చెప్పారు. ఉపాధికూలీల మస్టర్ కాగితాల్లో ఆబ్‌సెంటు వస్తున్నమాటవాస్తవమేనని, ఈ విషయాన్ని కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని వివరించారు.



ఆన్‌లైన్ మస్టర్ అప్‌లోడ్ కాకుండా ఎర్రర్ చూపిస్తున్న దృశ్యం

సీఎం మైనారిటీల పక్షపాతి

బొమ్మలసత్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద మైనారిటీల పక్షపాత అని నంద్యాల జిల్లా మైనారిటీ వింగ్ అధ్యక్షుడు యూనుస్‌బాషా అన్నారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 1,814 మంది హజ్ యాత్రికులకు రూ.14.50 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేయటం సంతోషంగా ఉందన్నారు. హజ్ యాత్రకు ఒక్కో యాత్రికుడికి సాధారణంగా రూ.3.85 లక్షల మేర ఖర్చవుతుందని, ప్రభుత్వం రూ.80 వేలు నేరుగా యాత్రికుడి ఖాతాలోకి జమ చేయటం హర్షించదగ్గ విషయమన్నారు.

వీపనగండ్ల గ్రామంలో ఉద్రిక్తత

మిడుతూరు: మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామంలో ఆదివారం ఎస్‌సీ సామాజిక వర్గానికి చెందిన రెండు వర్గాల మధ్య రస్తా విషయంలో ఘర్షణ తలెత్తడంతో గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి మిడుతూరు, ముచ్చుమర్రి ఎస్‌ఐలు గ్రామానికి చేరుకొని వివాదానికి దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు. పోలీసుల ఎదుటే ఇరు వర్గాలు కవ్వింపు చర్యలకు పాల్పడుతూ వాగ్వాదానికి దిగారు. మూడేళ్లుగా ఈ రస్తా విషయమై ఇరు వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం మరోసారి ఘర్షణ చోటుచేసుకోవడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ విషయమై పోలీసులు అప్రమత్తమై ఇరువర్గాలను గుమికూడకుండా చెదరగొట్టి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.



ఇరువర్గాలకు సర్ది చెబుతున్న సీఐ సుధాకర్‌రెడ్డి

ఆర్‌డీఓ దృష్టికి తీసుకెళ్లిన పోలీసులు

గ్రామంలో తలెత్తిన వివాదాన్ని నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి ఆత్మకూరు ఆర్‌డీఓ దృష్టికి తీసుకెళ్లారు. వివాదాలకు కారణమతున్న వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ తెలిపారు.

మండ్లెంలో విద్యుత్ తీగల చోరీ

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామానికి చెందిన 30 మంది రైతుల వ్యవసాయ పొలాల వద్దనున్న బోర్లు, బావుల విద్యుత్ మోటార్ల తీగలు చోరీకి గురికావటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం తెల్లవారు జామున మండ్లెం గ్రామానికి చెందిన జిలేబిబాషా, హబీబుల్లా, సలాం, శ్రీను, మాబాషా, నైమత్‌భాష, జంగాల మార్కండేయ, చాంద్‌భాష, అబ్దుల్‌రహమాన్, శ్రీకాంత్ వీరితో పాటు మరో 20మంది రైతులకు చెందిన విద్యుత్ తీగలను గుర్తుతెలియని వ్యక్తులు కట్ చేసుకొని ఎత్తుకెళ్లారు. ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు మోటార్ల స్విచ్చులు ఆన్‌చేయగా ఎంతకీ ఆడకపోవటంతో విద్యుత్ తీగలను పరిశీలించగా చోరీకి గురైన విషయాన్ని గుర్తించారు. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన 20 మంది రైతులకు చెందిన విద్యుత్ తీగలు కూడా చోరీ అయినట్లు గ్రామస్తులు తెలిపారు. రైతులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

ప్రకృతి వరప్రసాదం.. తాటి ముంజలు

- వేసవితాపం నుంచి ఉపశమనం
- మెండుగా ఆరోగ్యానికి మేలుచేసే పోషకాలు
- జోరుగా సాగుతున్న విక్రయాలు
- మే నెలాఖరు వరకు ప్రజలకు అందుబాటులో

నందికొట్కూరు: వేసవి తాపాన్ని తీర్చే తాటి ముంజలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి ఏడాది ఎండ కాలంలో ఈ తాటి ముంజలను ప్రకాశం జిల్లా మార్కాపురం ఏరియా నుంచి తీసుకొచ్చి నందికొట్కూరులో విక్రయిస్తుంటారు. ఈ సంవత్సరం కూడా తాటి ముంజల్నీ వాహనాలలో గోనె సంచీలో తెచ్చి పట్టణంలో ఒక్కో రోజు ఒక్కో ఏరియాలో రోడ్డు పక్కన్న పోసి విక్రయిస్తున్నారు. తియ్యగా నోట్లో వేసుకుంటే కరిగిపోయేలా ఉండే వీటి లోపల భాగం నీరుగా ఉంటుంది. ఈ ముంజలు శరీరానికి కలిగించే చలువ వల్ల ఐస్ ఆఫిల్ అని కూడా అంటారు. ఈ మంజుల్ని అప్పటికప్పుడే తాటి కాయల్లో నుంచి తీసి డజను రూ. 120 వరకు విక్రయిస్తున్నారు. పట్టణంలోని పెంట్రోల్ బంకు, పగిడ్యాల రోడ్డులో పాత బస్టాండ్, అల్లూరు రోడ్డులో, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

ముంజల్ వల్ల ఉపయోగాలు

- వేసవిలో వడదెబ్బ తగలకుండా ముంజలు చలువ చేస్తాయి.



తాటి ముంజలను అమ్ముతున్న వ్యాపారి

- నీటి శాతం అధికంగా ఉండటం వల్ల శరీరానికి కావాల్సిన మినరల్స్, చక్కెరలను ముంజలు సమతుల్యం చేస్తాయి.
- జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, ఎసిడీటీ లాంటి ఆరోగ్య సమస్యలన్నీ దూరం చేస్తాయి.
- బరువును తగ్గిస్తాయి. తాటి ముంజలలో శరీరానికి కావాల్సిన విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటిలో అధిక మొత్తంలో నీరుండటం వల్ల శరీర బరువు తగ్గించడానికి ముంజలు ఎంతోగానో ఉపయోగపడతాయి. తాటి ముంజలు కాలేయ సంబంధ సమస్యలను తగ్గిస్తాయి, ఈ కాయలో అధిక మొత్తంలో ఉండే పొటాషియం మన శరీరంలో ఉండే విష పదార్థాలను తొలగిస్తుంది.
- అధిక ఎండ వేడిమికి ఒక్కసారి వాంతులవుతుంటాయి. ముంజలను తినడం వల్ల వాంతులను అరికట్టవచ్చు.
- కేన్సర్ల దూరం చేస్తాయి. తాటి ముంజలు వివిధ రకాల ట్యూమర్స్, బ్రెస్ట్ కేన్సర్ కణాలను నిర్మూలిస్తాయి.
- శరీరంలో కోల్పోయిన నీటిని ముంజల ద్వారా పొందవచ్చు. తద్వారా అలసటను దూరం చేస్తాయి.
- తాటి ముంజలను పొట్టు తీయకుండా తినాలి. పై పొరలో ఏన్నో రకాల పోషక విలువలు ఉంటాయి. పొట్టు వల్ల శరీరానికి ఎక్కువ చలువు చేస్తుంది.

రోజుకు రూ. వెయ్యి ఆదాయం వస్తోంది



రోజుకు 360 ముంజలు అమ్మితే ఆదాయం రూ.వెయ్యి వస్తుంది. తాటి చెట్లను 60 నుంచి 100 వరకు రూ. 50 వేలు వెచ్చించి కొనుగోలు చేస్తాం. తాటి చెట్ల మీద నుంచి వీటి గెలల్ని నరికి ఆయా వాహనాలను ద్వారా నందికొట్కూరు తీసుకొచ్చి అమ్ముతాం. వేసవిలో దాహాన్ని తీర్చుకొనేందుకు చలువ చేసే ముంజలను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. రవాణా ఖర్చులు పోను రోజుకు కూలి గిట్టుబాటు అవుతుంది. సీజన్‌లో వ్యాపారం మాకు బాగానే ఉంది. మే నెల ఆఖరి వరకు తాటి ముంజలు దొరుకుతాయి.

– ఆవులయ్య మార్కాపురం, వ్యాపారి